ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 29.8, కనిష్ఠం 19.4

కామారెడ్డి
జిల్లా వార్తలు
5
శుక్రవారం 8 నవంబరు 2024

విద్యుత్ శాఖ ఎస్ఈగా శ్రావణ్ బాధ్యతల స్వీకరణ

కామారెడ్డి టౌన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి విద్యుత్ శాఖ ఎస్ఈగా శ్రావణ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. మంచిర్యాల జిల్లా నుంచి ఈయన కామారెడ్డికి బదిలీపై వచ్చారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఎస్ఈ రమేష్‌బాబు కరీంనగర్‌కు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఎస్ఈ శ్రావణ్ మాట్లాడుతూ రైతులు, ప్రజలు విద్యుత్ ప్రమాదాలు జరగకుండా విద్యుత్ సిబ్బంది సూచనలు ఎప్పటికప్పుడు పాటిస్తు తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

వరి ధాన్యం కొనుగోలు చేస్తున్న దృశ్యం



ధాన్యం కొనుగోళ్లకు.. నిబంధనలు!

- సన్నాల సేకరణకు షరతులు
- ప్రభుత్వం నిర్ణయించిన సన్న రకం మాత్రమే కొనుగోళ్లు
- నిర్ణీత కొలతలు ఉంటేనే సన్నాల సేకరణ
- గింజను కొలిచేందుకు ప్రత్యేక పరికరాలు
- నిబంధనలతో జిల్లాలో ఊపందుకోని ధాన్యం కొనుగోళ్లు
- ఇప్పటి వరకు 43 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోళ్లు
- ధాన్యం అమ్ముకునేందుకు అష్టకష్టాలు పడుతున్న రైతులు

కామారెడ్డి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గతంలో ఎన్నడూ లేనివిధంగా వరి ధాన్యం కొనుగోళ్లపై ప్రభుత్వం సవాలక్ష నిబంధనలను విధించింది. ఇప్పటికే కొనుగోళ్లలో జాప్యం నెలకొనడం, కేంద్రాలు ప్రారంభించి కాంటా మాత్రం చేయలేదు. అయితే పక్షం రోజుల కిందట కేంద్రాల్లో కాంటా ప్రారంభమైనా ప్రభుత్వం విధించిన షరతులు కొనుగోళ్ల ఊపందుకోవడం లేదు. సకాలంలో ధాన్యం కొనుగోళ్ల జరగకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పండించిన పంటను అమ్ముకునేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. ప్రభుత్వం ఈ సీజన్‌లో దొడ్డు, సన్నరకం వేర్వేరుగా కొనుగోలు చేపడుతోంది. సన్నాలకు బోనస్ ఇస్తామని ప్రకటించడంతో సన్నరకం పంటను రైతులు వేల ఎకరా ల్లోనే సాగు చేశారు. అయితే ప్రభుత్వం సన్న రకం ధాన్యం కొనుగోలు చేసేందుకు పలు నిబంధనలను విధించింది. ప్రభుత్వం ప్రకటించిన 33 రకాల సన్నాలు మాత్రమే కొనుగోలు చేయాలని ఆదేశించింది. దీంతో ప్రభుత్వం విడుదల చేసిన జాబితాలో లేని సన్నరకం ధాన్యం అమ్ముకునేందుకు రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏమి తోచక దళారులకు తక్కువ ధరకే అమ్ముకుంటున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సన్నాలకు కొర్రీలు

సన్నరకం ధాన్యానికి ప్రభుత్వం రూ.500ల బోనస్ ఇస్తున్నందున ఆ ధాన్యం కొనుగోళ్లకు పలు నిబంధనలను పెట్టింది. ప్రభుత్వం 33 రకాలను సన్నాలుగా గుర్తించింది. ఈ మేరకు గుర్తింపు జాబితా విడుదల చేసి కొనుగోలు చేయాలని ఆదేశించింది. సన్నరకం వడ్ల నుంచి బియ్యం గింజలను తీసి వాటిని కొలిచి ప్రభు త్వం నిర్ణయించిన కొలతలు ఉంటేనే కొనుగోలు చేయాలని షరతులు విధించింది. బియ్యం గింజలను కొలిచేందుకు పలు రకాల పరికరాలను అందు బాటులోకి తెచ్చింది. అలాగే సన్నరకం బియ్యం గింజల సైజును సైతం నిర్ణయించింది. బియ్యం గింజల పొడువు 6 మిల్లీ మీటర్ల కంటే తక్కువ ఉండాలని, పొడవు, వెడల్పు నిష్పత్తి 2.5 మి.మీల కంటే ఎక్కువగా ఉండాలని, వెడల్పు 2 మిల్లీ మీటర్లను మించి ఉండరాదని చెప్పింది. ఏఈవోలు తమ పరిధిలోని ధాన్యం కొనుగోళ్ల కేంద్రాలకు వెళ్లి సన్నాలు కొలిచి ప్రభుత్వం నిర్ణ యించిన సైజులో ఉన్నాయని ఆమోదం తెలిపి తే వాటిని సన్నాలుగా నమోదు చేయనున్నారు. అయితే ప్రభుత్వం సన్నాలుగా గుర్తించిన 33 రకాల వడ్లను జిల్లాలో తక్కువ మంది రైతులు సాగు చేసినట్లు తెలుస్తోంది.

జిల్లాలో 98 ఎకరాల్లో సన్నాల సాగు

ఈ వానాకాలం సీజన్‌లో జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ డివిజన్‌ల పరిధిలో వరి మొత్తం 3,15,457 ఎకరాల్లో సాగైంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం సన్నాలకు రూ.500ల బోనస్ ఇస్తామని ప్రకటించడంతో రైతులు జిల్లాలో వేల ఎకరాల్లోనే సన్న రకం వరిని సాగు చేశారు. జిల్లా వ్యాప్తంగా 98,627 ఎకరాల్లో సన్న రకం వరిని సాగు చేయగా 2,16,830 ఎకరాల్లో దొడ్డు రకం వరి సాగైంది. జిల్లా వ్యాప్తంగా ఈ సీజన్‌లో 6.90లక్షల మెట్రిక్ టన్నుల్లో ధాన్యం దిగుబడులు వస్తాయని వ్యవసాయశాఖ సంబంధిత శాఖ అధికారులకు నివేదించారు. ఇందులో దొడ్డు రకం 4,01,606 మెట్రిక్ టన్నులలో దిగుబడులు రానుండగా సన్న రకం 2,89,157 మెట్రిక్ టన్నుల్లో ధాన్యం దిగుబడులు వస్తాయని అంచనా వేశారు. కొనుగోలు కేంద్రాలకు 5.80 లక్షల మెట్రిక్ టన్నుల్లో ధాన్యం వస్తుందని పౌర సరఫరాల అధికారులు భావిస్తున్నారు. అయితే కొనుగోళ్ల ఆలస్యంగా ప్రారంభం కావడంతో ఇప్పటికే ధాన్యాన్ని రైతులు ప్రైవేట్ వ్యక్తులకు అమ్ముకున్నారు. ప్రధానంగా సన్న రకానికి బహిరంగ మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండడంతో దళారులు రైతుల వద్దకే వచ్చి కొనుగోలు చేశారు. అయితే ప్రస్తుతం ధాన్యం ధర తగ్గడంతో రైతులు కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారు. కేంద్రాల వద్ద కొనుగోళ్లకు సవాలక్ష నిబంధనలు పెట్టడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

తేమ శాతం రాక తంటాలు

వరి ధాన్యానికి తేమ శాతం రాక రైతులు రోజుల తరబడి కొనుగోలు కేంద్రాలు, రోడ్లపై, కల్లాల వద్ద ధాన్యాన్ని ఆరాబోస్తు తంటాలు పడుతున్నారు. ధాన్యం కొనుగోళ్లలో గతంలో మాదిరిగానే 17 శాతం తేమ వస్తేనే కొనుగోలు చేపట్టాలని నిబంధన ఉంది. అయితే ఈ నిబంధన రైతులకు ఇబ్బందికరంగా మారుతోంది. వానాకాలం సీజన్‌లో ధాన్యం పచ్చిగానే ఉండడంతో సకాలంలో తేమ శాతం రావడం లేదని రైతులు వాపోతున్నారు. రోజుల తరబడి కేంద్రాల వద్దనే ధాన్యాన్ని ఆర బెట్టాలంటే ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం నిర్ణయించిన సన్న రకం వంగడాలను మాత్రమే కొనుగోళ్ల చేపడుతామని కేంద్రాల్లో అధికారులు చెబుతున్నారు. ఆ నిబంధనతో ఇబ్బందులు పడుతుండగా తేమ శాతం రాక ధాన్యాన్ని అమ్మలేకపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దళారులకు పచ్చివడ్లను విక్రయిస్తే తక్కువ ధరకే కొనుగోలు చేస్తున్నారని దీంతో నష్టపోతున్నామని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఊపందుకోని ధాన్యం కొనుగోళ్లు

జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల ఊపందుకోవడం

(మిగతా 8వ పేజీలో)

లింగంపల్లిలో నిలిచిన కొనుగోళ్లు

- రోడ్డు బాగు లేక.. వడ్ల లారీలు రాక నిలిచిన కొనుగోళ్లు
- రోడ్డు కుంగిపోయి వాహనాల రాకపోకలకు అంతరాయం
- పట్టించుకోని అధికారులు
- అవస్థలు పడుతున్న రైతులు



7

ఆపద సమయంలో ఆర్థిక తోడ్పాటు

- బడుగు, బలహీన వర్గాలకు పార్థీవ వాహన సేవలు
- ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం కృషి



7

ఎత్తిపోతలు కాదు.. ఉత్తిపోతలే!

- పని చేయని బర్దీపూర్ లిఫ్ట్
- ప్రభుత్వం పట్టించుకోవాలని రైతుల వేడుకోలు



7

తెలంగాణ ధాన్యానికి ఇతర రాష్ట్రాల్లో చాలా డిమాండ్




భిక్కనూరు కొనుగోలు కేంద్రంలో ధాన్యం తేమ శాతాన్ని పరిశీలిస్తున్న డీఎస్ చౌహాన్, మాట్లాడుతున్న చౌహాన్, పక్కన కలెక్టర్

రాష్ట్ర సివిల్ సప్లయ్ కమిషనర్ డీఎస్ చౌహాన్

భిక్కనూరు, నవంబరు 7: తెలంగాణలో పండే ధాన్యానికి ఇతర రాష్ట్రాల్లో చాలా డిమాండ్ ఉందని ఆ పేరును చెడగొట్టవద్దని రాష్ట్ర సివిల్ సప్లయ్ కమిషనర్ డీఎస్ చౌహాన్ అన్నారు. గురువారం రాత్రి భిక్కనూరు మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ ఆవరణలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కామారెడ్డి కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఎంసీ ఆవరణలో రైతులు ఎండబోసిన ధాన్యాన్ని ఆయన పరిశీలించి ధాన్యం తేమ శాతాన్ని స్వయంగా తేమను కొలిచే యంత్రంలో వేసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తేమ శాతం ఎక్కువగా ఉన్న ధాన్యాన్ని, పచ్చిగా ఉన్న ధాన్యాన్ని ఎలా తీసుకుంటున్నారని, తేమ శాతం ఎక్కువగా ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయడం కారణంగా ధాన్యం రంగు మారడమే కాకుండా బియ్యం చెడిపోవడం జరుగుతుందని, తద్వారా ఇతర రాష్ట్రాల్లో తెలంగాణలో పండించిన బియ్యానికి ఉన్న పేరును పాడవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయాధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందిచుకుని ప్రతీ రైతు తన వరి పంటను కోసే సమయంలో తప్పనిసరిగా తేమ శాతం చూసుకుని 30 శాతం కంటే తక్కువగా ఉంటేనే వరి కట్ విధంగా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. వరి కోత యంత్రాల్లో సైతం ధాన్యం కట్ చేసే సమయంలో వరి కోత యంత్రాల యజమానులు ఆర్పీఎం 19 నుంచి 20గా పెట్టేలా చూడాలన్నారు. వరి ధాన్యం ఎండకుండా కొనుగోలు చేయడం కారణంగా ధాన్యం ఎక్కువ రోజులు నిల్వ ఉండదని, ధాన్యం త్వరగా చెడిపోయే అవకాశం ఉందన్నారు. దీంతో పాటుగా రేషన్ దుకాణాలకు ఈ ధాన్యంతో తయారు చేసిన బియ్యాన్ని ప్రజలకు పంపిణీ చేస్తే ఈ బియ్యాన్ని తినలేక రీసైక్లింగ్‌కు విక్రయిస్తారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు నాణ్యమైన బియ్యాన్ని అందించాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతుందన్నారు. రైతులు సైతం అధికారులకు సహకరించాలని తేమ శాతం ఎక్కువగా ఉంటే కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకురావద్దని కోరారు. ధాన్యాన్ని బాగా ఆరబెట్టిన అనంతరమే ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలన్నారు. ధాన్యం విక్రయించిన రెండు రోజుల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు వేయడం జరుగుతుందన్నారు.

సన్న వడ్లపై రైతులు దృష్టి సారించాలి

రాష్ట్ర ప్రభుత్వం సన్న రకం ధాన్యానికి ఎకరాకు రూ.500ల బోనస్ ఇస్తుందని రైతులు సన్న రకం వరి ధాన్యాన్ని సాగు చేయాలని ఈ సందర్భంగా సూచించారు. సన్న రకంలో చాలా రకాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏ రకం సాగు చేసినా ఎకరాకు తప్పనిసరిగా రూ.500ల బోనస్ అందజేస్తామన్నారు. రైతులు ఎక్కువగా సన్న రకం పండించేలా వ్యవసాధికారులు రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. అధికారులు వరి కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేయాలని, అధికారులు విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉంటే సహించేది లేదన్నారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాల్లో తేమ శాతం ఎక్కువగా ఉన్న ధాన్యాన్ని అనుమతి ంచడం పట్ల విండో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్, ఆర్డీవో రంగనాథ్, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ పాత రాజు, సివిల్ సప్లయ్, రెవెన్యూ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

108లో ఉద్యోగానికి ఇంటర్వ్యూ

కామారెడ్డి టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): 108లో ఈఎంటీ(ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్) ఉద్యోగాల కోసం ఆసక్తి గల అభ్యర్థులు శనివారం నిర్వహించే ఇంటర్వ్యూకు హాజరు కావాలని జిల్లా మేనేజర్ తిరుపతి తెలిపారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లను, ఒక జిరాక్స్ సెట్‌ను వెంట తీసుకుని రావాలని తెలిపారు. ఎంఎల్‌టీ, డీఎంఎల్‌టీ, జీఎన్ఎం, ఏఎన్ఎం, బీఎస్సీ (బీజడ్‌సీ), బీఎస్సీ నర్సింగ్ చేసిన వారు అర్హులని తెలిపారు. 30 సంవత్సరాలలోపు ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కామారెడ్డి ఓల్డ్ ఎంఆర్‌ఓ కార్యాలయం వద్ద ఇంటర్వ్యూ నిర్వహిస్తామని తెలిపారు.

పల్లెల్లో.. ప్రత్యేకాధికారులకు పరీక్ష!

కామారెడ్డి టౌన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): సర్పంచ్‌ల పదవి కాలం ముగిసి 10 నెలలు కావస్తుండగా రాష్ట్ర వ్యాప్తంగా ఇతర విభాగాల అధికారులకు ప్రత్యేకాధికారులుగా గ్రామ పంచాయతీ బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. గ్రామాల స్వచ్ఛతకు మొదటి ప్రాధాన్యతను ఇస్తు పనులకు శ్రీకారం చుట్టింది. దీంతో సొంత శాఖలోని పనులతో పాటు పల్లెల్లో పనులు చేయడం ప్రత్యేకధికారులకు పరీక్ష కాలంగా మారింది. తమ శాఖలోని పనులతో పాటు ఇతర శాఖలకు ఇన్‌చార్జీలుగా వ్యవహరించడంతో పాటు ఆయా మండలాలకు ప్రత్యేకాధికారులుగా కొనసాగుతూ ఈ విభాగంలోనే పూర్తిస్థాయిలో సేవలు అందించలేకపోతున్నామంటూ అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల సీజనల్ వ్యాధుల సమయంలోనే అధికారులు అన్ని గ్రామాల్లో పర్యటించేందుకు ఇబ్బందులు ఏర్పడడంతో పారిశుధ్య కార్యక్రమాలు సరిగా జరగక పెద్దఎత్తున డెంగ్యు, చికెన్‌గున్యా లాంటి వ్యాధుల భారిన ప్రజలు పడుతూ వస్తున్నారు.



- ప్రత్యేకాధికారులుగా నియామకమైన ఆయా శాఖల అధికారులు
- వారి శాఖ పనులతో పాటు గ్రామ పంచాయతీ పనులు
- పారిశుధ్య, తాగునీటికి ఇబ్బందులు
- ఇంటి పన్నుల వసూళ్ల భారం

గ్రామాల్లో పారిశుధ్య, తాగునీటి ఇబ్బందులు

గ్రామాల్లో పారిశుధ్య, తాగునీటి ఇబ్బందులు తీర్చడం ప్రత్యేకాధికారులకు కీలకంగా మారింది. గతంలో నీటి సమస్య తలెత్తితే ఖాళీ బిందెలతో సర్పంచ్‌లను, అధికారులను అడ్డుకున్న సంఘటనలు అనేకం ఉన్నాయి. ఆయా మండలాల పరిధిలోని గ్రామాల్లో, తండాల్లో నీటి ఎద్దడి ఎక్కువగా ఉంటుంది. మిషన్ భగీరథ నీరు రాక అనేక మంది ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇక పారిశుధ్య సమస్యలతో ప్రజలు సతమతవుతునే ఉన్నారు. పలు గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులైన విధులకు సమయానికి హాజరై పారిశుధ్య పనులపై పర్యవేక్షణ చేస్తేనైన ఎంతో కొంత ప్రజలకు ఇబ్బందులు తప్పే అవకాశాలు ఉండేవి. కాని చాలా వరకు పంచాయతీ కార్యదర్శులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో సర్పంచ్‌లు ఉన్నప్పుడు నీటి, పారిశుధ్య సమస్యలు రోజుల వ్యవధిలోనే పరిష్కారం అయ్యేవని ఇప్పుడు ఆ పరిస్థితులు లేవని వాపోతున్నారు. ప్రత్యేకాధికారులు వచ్చిన ఒకటి రెండు గ్రామాలను మాత్రమే సందర్శిస్తుండడంతో మిగిలిన గ్రామాల్లో సమస్యలు అలాగే ఉండిపోతున్నాయని కనీసం గ్రామ పంచాయతీ కార్యదర్శులు సమయ పాలన పాటించి సమస్యలపై దృష్టి సారిస్తే ఎంతో కొంత సమస్యలు తీరుతాయనే అభిప్రాయం ప్రజల నుంచి వ్యక్తం అవుతుంది.

అంతంత మాత్రంగానే పన్నుల వసూళ్లు

పన్నుల వసూళ్ల విషయంలో కొందరు సర్పంచ్‌లు వారి పదవి కాలంలో అంతగా పట్టించుకోకపోవడంతో పెద్దఎత్తున బకాయిలు పేరుకపోయినట్లు పలువురు ప్రత్యేకాధికారులు పేర్కొంటున్నారు. మరో 4 నెలల్లో ఆర్థిక సంవత్సరానికి గడువు ఉండడంతో బాధ్యతలు తీసుకున్న ప్రత్యేకాధికారులకు తలకుమించిన భారంగానే మారుతుంది. ప్రత్యేకాధికారులుగా రెవెన్యూ, వ్యవసాయ, పంచాయతీరాజ్, నీటి పారుదల తదితర శాఖలకు చెందిన అధికారులను నియమించడం వారికే రెండు నుంచి మూడు గ్రామ పంచాయతీలు అప్పగించడంతో వారి శాఖ పనులతో పాటు ఈ పనులపై ప్రత్యేక దృష్టిసారించాల్సి రావడంతో సతమతం అవుతున్నారు. పన్నుల వసూళ్లు లేక గ్రామ పంచాయతీలో కార్మికులకు జీతాలు, ఇతర అవసరాలకు నిధుల కొరత ఏర్పడుతోంది.

సర్వేలో సమగ్ర సమాచారాన్ని సేకరించాలి

ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి, గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి డాక్టర్ శరత్

కామారెడ్డి టౌన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ, కుల సర్వే సమగ్రంగా పూర్తి సమాచారాన్ని సేకరించాలని ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి, గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి డాక్టర్ ఎ.శరత్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటి సమగ్ర సర్వే పూర్తి సమాచారం సేకరించాలని, సర్వేలో ఆయా కుటుంబాలు అందించే వివరాలను నమోదుచేసుకోవాలని సూచించారు. సమాచారం ఉంటేనే అభివృద్ధి ప్రణాళికలు చేపట్టవచ్చని అభిప్రాయపడ్డారు. ప్రతీ టీమ్ రోజుకు కనీసం 15 గృహాలను సర్వే చేయాలని సూచించారు. జిల్లాలో సర్వే కోసం ఏర్పాటు చేసిన ఎన్యూమరేటర్స్, సూపర్‌వైజర్‌ల వివరాలను అంతకుముందు కలెక్టర్ వివరించారు. సర్వేతో పాటు ఆన్‌లైన్ ఎంట్రీలు కూడా నిర్వహించాలని తెలిపారు. జిల్లాలో వరి ధాన్యం కొనుగోలుకు అవసరమైన ప్రతీచోట కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. రైతులు సంక్షేమం దృష్ట్యా కేంద్రాలను ఏర్పాటు చేశారని తెలిపారు.

ప్రతీ కుటుంబం సర్వేలో నమోదు అయ్యేలా చూడాలి

● జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారి సాయగౌడ్

కమ్మర్‌పల్లి, నవంబరు 7:(ఆంధ్రజ్యోతి) రాష్ట్రవ్యాప్తంగా అన్ని సామాజికవర్గాలను గుర్తించాలన్న ముఖ్య ఉద్దేశంతోరాష్ట్ర ప్రభుత్వం సమగ్ర ఇంటింట కుటుంబ సర్వే కార్యక్రమాన్ని చేపట్టిందని ఈ సర్వేలో ప్రతికుటుంబం నమోదయ్యేలాచూడాలని జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారి(డీఆర్డీవో) సాయగౌడ్ అన్నారు. గురువారం మండలంలోని హసాకొత్తూర్ గ్రామంలో నిర్వహిస్తున్న సమగ్ర ఇంటింట కుటుంబ సర్వేకార్యక్రమాన్ని ఆయన సందర్శించి పరిశీలించారు. ఎన్యూమరేటర్లు ప్రతీ ఇంటికి వెళ్లి కుటుంబ వివరాలను నమెదుచేయాలని, ఈ సర్వేలో భాగంగా ఇంటికి వచ్చే అధికారులకు తమ పూర్తి వివరాలు చెప్పి నమోదుచేసుకునేలా పూర్తి సహకారం అందించాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా మండల ఎంపీడీవో రాజా శ్రీనివాస్ ద్వార మండలంలోని అన్నిగ్రామాల సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎన్యూమరేటర్లు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం ప్రకారం సర్వే సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. శుక్రవారం సాయంత్రంలోగా కుటంబాల గుర్తింపు కార్యక్రమాన్ని పూర్తి చేయాల్సి ఉంటుందని సూచించారు. తదుపరి ఇళ్లకువెళ్లి కుటుంబ యాజమాని ఇచ్చినసమాచారాన్ని సవివరంగా నమో దు చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఏపీఎం,కార్యదర్శి రాజన్న ఉన్నారు.

బోధన్‌రూరల్: ఆర్థిక, సామాజిక, రాజకీయ, విద్య, ఉపాధి, కుల వివరాల సేకరణకై రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జరిపిస్తున్న ఇంటింటి కుటుంబ సర్వేకు ప్రజలు తమవంతు పూర్తి సహకారం అందించాలని బోధన్ మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ అన్నారు. గురువారం బోధన్ పట్టణంలో ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహిస్తున్న తీరును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ అంకు సంధ్య దాము, ఎన్యూమలేటర్లు పాల్గొన్నారు.

ముప్కాల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటి కుటుంబ సర్వే గురువారం ముప్కాల్, బాల్కొండ మండలాల్లో కొనసాగుతుంది. ఇంటి నెంబర్‌తో కూడిన స్టిక్కర్‌లను అతికిస్తూ ఇంటింటికి సిబ్బంది తిరుగుతున్నారు. ఈ సర్వే రేపటితో ముగియనుండడంతో ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. ఈనెల 9వ తేదీ నుంచి స్మామాగ కుటుంబసర్వే ప్రారంభం కాబోతుందన్నారు. 56 ప్రధాన ప్రశ్నాలతో పాటు 19అనుసంధాన ప్రశ్నాలతో మొత్తం 75ప్రశ్నాలతో సర్వే జరగబోతుంది. మూడు రోజుల పాటు కొనసాగనుంది. ప్రతీ కుటుంబానికి, ఇళ్లను, కుటుంబ యాజమానితో పాటు స్లిక్కర్‌లను అతికించే కార్యక్రమం పూర్తవుతుందన్నారు ఈనెల 9నుంచి పూర్తిస్థాయిలో కుటుంబ ఇంటింటి సర్వే ప్రారంభమవుతుందన్నారు. ఇందికు సంబంధిచి పూర్తి ఏర్పాట్లను అధికారులు, ఎన్యుమాలేటర్లు ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు.


హసాకొత్తూర్‌లో ఇంటింట సర్వే ప్రక్రియను పరిశీలిస్తున్న డీఆర్డీవో

కోటగిరి: సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జడ్పీ సీఈవో ఉషా సూచించారు. కోటగిరి ఉమ్మడి మండలంలో సమగ్ర కుటుంబ సర్వేను గురువారం ఆమె పరిశీలించారు. కొత్తపల్లి క్యాంప్, బస్వాపూర్, పొతంగల్ గ్రామాలలో పర్యటించి సర్వే ప్రక్రియను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మద్నూర్: ఉమ్మడి మద్నూర్ మండలంలో ఇంటింటి టాక్లీ గ్రామంలో సిబ్బంది ఇంటింటికి తిరిగి స్టిక్కర్లను అతికించారు. ఈసందర్భంగా ప్రతీ ఇంటి యజమానులతో మాట్లాడుతూ మూడు రోజుల పాటు సర్వే కుటుంబాలను గుర్తించడం మాత్రమే జరుగుతుందని కావున కుటుంబ యజమానులు లేదా కుటుంబ సభ్యులు ఒకరు అయిన సరే సకాలంలో అందుబాటులో ఉండాలన్నారు. కుటుంబాలను గుర్తించిన రెండు రోజుల తరువాత నుంచి రెండో దశ సర్వే ప్రక్రియ మొదలవుతుంది. కావున కుటుంబ స భ్యులు ఒకరు ఉన్న సరిపోతు ంది. లేదంటే ఫోన్ చేసి తెలిపిన సరే అని సూచించారు.

నిజాంసాగర్:మహ్మద్‌నగర్ మండలంలోని నడిమి తండాలో గురువారం కులగణన సర్వేనుసూపర్‌వైజర్ ప్రవీణ్ సర్వే తీరును పరిశీలించారు.కులగ ణన సర్వేకు నడిమితండాలో ఇంటి యజమానులు సహకరించాలని సూచిం చారు.

తాడ్వాయి: మండలంలో నిర్వహిస్తున్న సమగ్ర సామాజిక ఆర్థిక కుటుంబ సర్వేకు ప్రతి ఒక్కరు సహకరించాలని మండల అభివృద్ధి అధికారి సయ్యద్ అలీ అన్నారు. ఈయన గురువారం మండలంలో నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఈనెల 8వ తేది వరకు స్టిక్కర్లను అతికించడం జరుగుతుందని తరువాతనే కుటుంబ సర్వే నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. వీటిని గ్రామంలోని ప్రతి కుటుంబ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.


నడిమితాండలో సర్వేను పరిశీలిస్తున్న సూపర్ వైజర్ ప్రవీణ్

రాజంపేట: రాజంపేట మండల కేంద్రంతో పాటు గ్రామాలలో గురువారం సమగ్ర ఇంటి ంటి కుటుంబ సర్వేలో ఇంటింటికి స్టిక్కర్ల అంటివేతను ఎంపీడీఓ రాజేశం పరిశీలించారు. కుటుంబాల గుర్తింపు సర్వేను పకడ్బందిగా చేపట్టాలని అన్నారు. ప్రభుత్వం సూచించిన నిబంధనల ప్రకారం సర్వే చేపట్టాలని సర్వేలో ఇచ్చిన పూర్తిసమాచారాన్ని ఇంటియాజమానితో సేకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ రఘురాం, పంచాయతీ కార్యదర్శులు అశోక్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రామారెడ్డి: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటి కుటుంబ సర్వేపై రెండవ రోజు ఎన్యూమనేటర్లు నిర్వహణ వ్యవస్థ గురువారం ముమ్మ రంగా కొనసాగింది. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సూపర్ వైజర్లు, ఉపా. దిహామీ పథకం ఏపీవో ధర్మారెడ్డి, పంచాయితీ కార్యదర్శులు, ప్రభుత్వ ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచ్లు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

గాంధారి: గాంధారి మండలంలో సామాజిక, ఆర్థిక,విద్య, రాజకీయ, ఇంటింటి కుటుంబసర్వే మండలంలోని అన్ని గ్రామాలలో రెండోరోజు కొనసా గింది. స్టికర్లను ప్రతి ఇంటికి అంటించే కార్యక్రమం ముమ్మరంగా చేపట్టారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ, ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్‌లు పాల్గొన్నారు.

నసురుల్లాబాద్:మండలంలోని ఆయా గ్రామాల్లో గురువారం అధికారులు సమగ్ర కుటుంబ సర్వే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్యూమనేటర్లు ఇంటింటికి తిరుగుతూ స్టిక్కర్లను అతికించారు. ఆమె వెంట అధికారులు, ఎన్యూమనేటర్లు, గ్రామ పంచాయితీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

కొండకేగిన శ్రీలక్ష్మీనర్సింహుడు


భీమ్‌గల్‌లో లక్ష్మీనర్సింహస్వామిని ఊరేగింపుగా నిర్వహిస్తున్న దృశ్యం

భీమ్‌గల్, నవంబరు7(ఆంధ్రజ్యోతి): కార్తిక మాస బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం భీమ్‌గల్‌లోని గ్రామ ఆలయం నుంచి శ్రీలక్ష్మీ నర్సింహ ఉత్సవమూర్తులను స్వర్ణ పుష్పాలంకరణలతో నంది వంశస్తులు ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం బోయిల పల్లకి, నాయిబ్రహ్మణుల దీవీటీలు, కాంతలు మహిళల, మంగళ, హారతులు, బోనాలు, భాజాభజంత్రీలు మేళతాళలు, పురోహితులు, వేదమంత్రాలతో ఊరేగింపుగా లింబాద్రిగుట్ట పైకి తీసుకెళ్లారు.

చేపల పెంపకంపై విద్యార్థులకు అవగాహన

భీమ్‌గల్, నవంబరు7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం జూనియర్ కళాశాలలకు చెందిన ఫిషరీష్ మొదటి, రెండవ సంవత్సరం విద్యార్థులకు గురువారం ఓజేటీలో భాగంగా అధ్యాపకులకు శ్రీనివాస్ ఆధ్వర్యంలో చేపల పెంపకంపై అవగాహన కల్పించినట్లు ప్రిన్సిపాల్ జైపాల్‌రెడ్డి తెలిపారు. పట్టణ కేంద్రంలోని రాగుల కుంటలోని నీటి నాణ్యత నీటిలో పెరిగే విషజంతువులు, వాటి వల్ల కలిగే లాభాలను, నష్టాలను గురించి క్షేత్ర స్థాయిలో ప్రత్యక్షంగా వివరించి నీటి యొక్క లవనీయత, భౌతిక రసాయన లక్షణాలను గుర్చి అవగాహన కల్పించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలకు పోచంపాడ్ విద్యార్థుల ఎంపిక

మెండోర, నవంబరు7(ఆంధ్రజ్యోతి): మండలంలో పోచంపాడ్ జిల్లా పరిషత్ ఉన్నత విద్యార్థులు రాష్ట్రస్థాయి బీచ్, వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం గుంటూరు శుభ ఫిజికల్ డైరెక్టర్ నరేందర్ తెలిపారు. ఈ సందర్భంగా అక్షయ్, అల్మాస్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి బీచ్, వాలీబాల్ పోటీలకు ఎంపిక కావడంతో పాఠశాల ఉపాధ్యా య బృందం విద్యార్థులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పీఆర్టీయూ అధ్యక్షుడు సురేందర్, నస్ముద్దిన్, అశోక్, భూపతి రావు, దర్మపురి తిరుమల, సురేఖ, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు విద్యార్థిని ఎంపిక

ఆర్మూర్‌రూరల్, నవంబరు7(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మండలం ఫత్తేపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని శ్రీవిద్య రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకట నర్సయ్య, పీఈటీ నిఖిత తెలిపారు. ఇటీవల కంజరలోని గురుకుల పాఠశాలలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా ఎంపిక పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన శ్రీవిద్య రాష్ట్రస్థాయిలో ఎస్‌జీఎఫ్ అండర్-17 బాలికల విభాగంలో ఎంపికైందన్నారు.

ఖోఖో పోటీలలో బాల్కొండకు మొదటి బహుమతి

ముప్కాల్, నవంబరు7(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల అండర్-17 ఖోఖో పోటీలను కంజరలో నిర్వహించగా బాల్కొండ కేజీబీవీ పాఠశాల మొదటి బహుమతి సాధించింది. ప్రతిభ చూపిన ముగ్గురు విద్యార్థినిలు మైథిలి, శ్రీవర్ష, ఆనందిలను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ భవాని తెలిపారు.

108లో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

బోధన్‌రూరల్,నవంబరు7(ఆంధ్రజ్యోతి):108 అంబులెన్సులో ఈఎంటీ ఉద్యోగాలకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు జిల్లా మేనేజర్ రవి, మధులు అన్నారు. గురువారం బోధన్ పట్టణంలోని రాకాసిపేట్ లయన్స్ క్లబ్ వద్ద సమావేశం నిర్వహించారు. ఈ నెల 8న 108 అంబులెన్సులో మెడికల్ టెక్నిషియన్‌గా అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. బీఎస్సీ, బీజడ్‌సీ, ఎన్‌యూఆర్ఎస్, ఏఎన్ఎంజీ ఫార్మసీ, బీ ఫార్మసీ, ఎంఎల్‌టీ చదివిన వారు అర్హులని తెలిపారు. 8వ తేదిన ఉదయం 10గంటల నుండి మధ్యాహ్నం 3గంటల వరకు జిల్లా కేంద్ర ఆసుపత్రి 7వ అంతస్తులో గల 108కార్యాలయంలో ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు.

అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలి

ఆర్మూర్ రూరల్, నవంబరు7(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్‌లోని తెలంగాణలోని సాంఘీక సంక్షేమ మహిళ డిగ్రీ కళాశాలలో చరిత్ర (హిస్టరి) సబ్జెక్టు బోధనకు అధ్యాపకుల నుంచి దరఖాస్తులు కోరుతున్నామని కళాశాల ప్రిన్సిపాల్ చంద్రిక తెలిపారు. సంబంధిత సబ్జె క్టులో పీజీలో 55శాతం మార్కులు పొందిన వారు అర్హులన్నారు.నెట్, సెట్, పీహెచ్‌డి బోధన అనుభావం కలిగిన వారికి ప్రాధాన్యం ఉంటుం దన్నారు. ఆసక్తి ఉన్న మహిళ అభ్యర్థులు సంబంధిత సర్టిఫికెట్‌లను క ళాశాలలో అందజేయాలని, వీరికి ఈనెల 9వ తేదీన రాత పరీక్ష, మౌ ఖిక పరీక్ష నిర్వహించి ఉద్యోగానికి ఎంపిక చేస్తానని ప్రిన్సిపాల్ తెలిపారు.

నేడు శివాలయం అభివృద్ధి కమిటీ ప్రమాణ స్వీకారం

బోధన్‌రూరల్,నవంబరు7(ఆంధ్రజ్యోతి): నేడు బోధన్ పట్టణంలోని ఏకచక్రేశ్వరాలయంలో నూతన అభివృద్ధి కమిటీ ప్రమాణ స్వీకారం ఉంటుందని శివాలయం కమిటీ నూతన కమిటీ అధ్యక్షుడు హరికాంత్ చారి తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి హాజరుకానున్నారన్నారు. పట్టణ ప్రముఖులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

సీసీ కెనాల్ నిర్మాణం కోసం సర్వే

డొంకేశ్వర్, నవంబరు7(ఆంధ్రజ్యోతి): సీసీ కెనాల్ నిర్మాణం కోసం డొంకేశ్వర్ మండలం మారంపల్లి లిఫ్ట్ పరిధిలోని నూత్‌పల్లి గ్రామంలో ఇరిగేషన్ ఏఈ ప్రవీన్ గురువారం సర్వే చేపట్టారు. మారంపల్లి లిఫ్ట్ పరిధిలోని శిథిలావస్థకు చేరిన కెనాల్‌ను గుర్తించి వాటిని మరమ్మతులు కోసం సర్వే చేశారు. శిథిలావస్థకు చేరిన స్థానంలో సీసీ కెనాల్‌లో నిర్మించేందుకు సర్వే చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. సర్వే వివరాలను ఉన్నతాధికారులకు అందజేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో లిఫ్ట్ డైరెక్టర్‌లు దేగాం గంగారెడ్డి, బోరబండి రాజారెడ్డి, సుజికి రాజారాం, చిన్నారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీరు సీసాలో కప్ప అవశేషం

● భయాందోళనలో మద్యం ప్రియులు

● వైన్‌షాప్ సిబ్బందిపై ఆగ్రహం

డొంకేశ్వర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): తాగేందుకు కొన్న బీరు సీసాలో కప్ప అవశేషం కనిపించడంతో మద్యం ప్రియులు భయాందోళనకు గురైన సంఘటన నిజామాబాద్ జిల్లాలో గురువారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. డొంకేశ్వర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన పలువురు యువకులు గురువారం విందు చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఇందుకోసం డొంకేశ్వర్‌లోని వైన్ షాప్‌లో 12 బ్లాక్ బాస్టర్ ఆల్ట్రా కంపెనీ బీర్ బాటిళ్లను కొనుగోలు చేశారు. తర్వాత తాగుదామని చూస్తే ఓ బీర్ బాటిల్‌లో కప్ప అవశేషం కనిపించింది. దీంతో అవాక్కైన యువకులు వెంటనే వైన్‌షాప్‌కు వెళ్లి.. ఈ విషయమై ఆగ్రహం వ్యక్తం చేశారు. కప్ప అవశేషం బీఆర్ బాటిల్‌లోకి ఎలా వచ్చిందని ప్రశ్నించారు. దీంతో స్పందించిన వైన్ షాప్ యజమాని ఈ ఘటనతో తమకు సంబంధం లేదన్నారు. ఆ సీసా కంపెనీ నుంచి వచ్చిందని, ఇందుకు తామేమి చేస్తామని చెప్పడంతో.. యువకులు కంగుతిన్నారు. ఆ తర్వాత కప్ప అవశేషంతో కూడిన బాటిల్‌ను సెల్‌ఫోన్‌లో చిత్రీకరించి సోషల్ మీడియాలో వైరల్ చేశారు. మరో వైపు.. డొంకేశ్వర్‌లోని వైన్స్‌లో బీరుబాటిల్ ధర రూ.210 ఉంటే రూ.170కు బీరు అమ్మడంతో కంపెనీ బీరేనా.. లేకుంటే లేబుల్ వేసి వైన్స్ యాజమన్యాం అమ్ముతున్నారా!? అని మద్యం ప్రియులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై ఎక్సైజ్ శాఖాధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరపాలని మందుబాబులు కోరుతున్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి


లేబర్ ఆఫీసర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్,నవంబరు7(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, గత మూడు నెలల నుండి క్లైమ్స్‌కు సంబంధించిన ఆన్‌లైన్ సేవలు రాష్ట్ర ప్రభుత్వం నిలిపివేయడం జరిగిందని వెంటనే పునరుద్ధరించాలని గురువారం బోధన్ కార్మిక శాఖ అధికారికి భవన కార్మిక సంఘం నాయకులు, కార్మికులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులకు రావాల్సిన క్లైమ్స్ మెటర్నరీ క్లైమ్స్‌లను ప్రభుత్వం వెంటనే అందించాలన్నారు. ఆన్‌లైన్ సేవలు ప్రభుత్వం వెంటనే పునరుద్ధరించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో లేబర్ ఆఫీసర్ నరేంద్ర రాజు, కార్మిక సంఘం నాయకులు గంగాధర్, శ్రీను, కుర్తె లింగం తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి అదృశ్యం


ఎల్లవ్వ(ఫైల్)

కోటగిరి,నవంబరు7(ఆంధ్రజ్యోతి): రుద్రూర్ మండలంలోని చిక్కడ్‌పల్లి గ్రామానికి చెందిన మచ్కురి ఎల్లవ్వ(76)అనే వృద్ధురాలు అదృశ్యమైనట్లు ఎస్ఐ సాయన్న తెలిపారు. వృద్ధురాలి కొడుకు అక్షయ్, భార్య అనిత గత రెండేళ్ల నుంచి హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. ఎల్లవ్వ చిక్కడ్‌పల్లి గ్రామంలో ఒంటరిగా నివసిస్తుంది. గత నెల 14వ తేదిన ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఎల్లవ్వ ఇప్పటికి తిరిగి రాలేదు. చుట్టు పక్కల బంధువుల ఇళ్లలో ఆచూకీ కోసం ప్రయత్నించిన ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. ఎల్లవ్వ తనయుడు అక్షయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యార్థి అదృశ్యం

బోధన్ రూరల్, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): బోధన్ మండలం ఊట్‌పల్లి గ్రామానికి చెందిన బానావత్ జయవర్ధన్ అనే విద్యార్థి అదృశ్యమయినట్టు బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్ రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం బోధన్ పట్టణంలోని మైనార్టీ కళాశాల వసతి గృహంలో ఇంటర్మీడియట్ చదువుతున్నారన్నారు. దసరా సెలవులకోసం ఇంటికి వచ్చిన అతను తిరిగి కళాశాలకు వెళ్ళలేదని తల్లి గిరిజ ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. బంధువులు, సన్నిహితుల వద్ద వెతికినప్పటికి ఆచూకీ లభించలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని అన్నికోణాల్లో దర్యాప్తు జరుపుతున్నామన్నారు.

పాఠశాల అభివృద్ధి పనులను పకడ్బందీగా నిర్వహించాలి


పట్టణంలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఏఈ, కౌన్సిలర్లు

బోధన్‌రూరల్,నవంబరు7(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో భాగంగా 17.50 లక్షలతో చేపడుతున్న అభివృద్ధి పనులను గురువారం మున్సిపల్ ఏఈ శ్రీనివాస్, కౌన్సిలర్ శరత్ రెడ్డిలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల సౌకర్యార్థం చేపడుతున్న అభివృద్ధి పనులను పారదర్శకంగా చేపట్టాలన్నారు. మరుగుదొడ్లను, తాగునీటి సౌకర్యం కోసం నిర్మించే ట్యాంకు, కిచెన్ షెడ్డు కోసం చేపట్టే పనులను పరిశీలించారు. మరమ్మత్తు పనులను త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ బాలచంద్రం, ఉపాధ్యాయులు నగేష్ బాబు, నాయకులు మారయ్య, రాములు, ఇంద్రకరణ్ తదితరులు పాల్గొన్నారు.

మండల కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ అధ్యక్షుడిగా శ్రీనివాస్

నవీపేట,నవంబరు7(ఆంధ్రజ్యోతి): మండల కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ అధ్యక్షుడిగా మండలంలోని నందిగామకు చెందిన బోయిడి శ్రీనివాస్ నియామకమయ్యారు. ఈ మేరకు గురువారం జిల్లా కాంగ్రెస్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వాజీద్ పాషా, జిల్లా అధ్యక్షులు వై.సంతోష్‌ల చేతుల మీదుగా నియామకపత్రాన్ని అందుకున్నారు. బోయిడి శ్రీనివాస్ గతంలో నందిగామ సర్పంచ్‌గా పని చేశారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్, సంపత్, అఫ్సర్, దిలీప్, రాజు తదితరులు పాల్గొన్నారు.

మాలల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

కోటగిరి,నవంబరు7(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంలో ఈ నెల 10వ తేదిన నిర్వహించే మాల ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని మాల మహనాడు మండల అధ్యక్షులు మిర్జాపూర్ సాయన్న కోరారు. కోటగిరి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో గురువారం ఆత్మీయ సమ్మేళన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాల మహనాడు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

ఆర్మూర్‌రూరల్, నవంబరు7(ఆంధ్రజ్యోతి): పెరిగిన మెస్‌చార్జీలకు అనుగుణంగా విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి అన్నారు. గురువారం ఆర్మూర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గస్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పాఠశాలలు, గ్రామాల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో మాట్లాడారు. పాఠశాలలో మౌలిక వసతుల సమస్యలను అన్ని పాఠశాలల్లో విద్యార్థుల వారీగా సంఖ్య, అమ్మ ఆదర్శ పాఠశాలలో చేపట్టిన పనుల వివరాలను అధికారులతో సమీక్షించారు. చేపట్టిన పనులను సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. మౌలిక వసతుల కల్పనకు నిధులు మంజూరు చేయిస్తానని, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేం దుకు కృషి చేయాలని ఎంఈవోలు, హాస్టల్ వార్డెన్‌లు, ఆదర్శ పాఠశాలల అధికారులకు సూచించారు. రెవెన్యూ శాఖ పరిధిలో భూ సమస్యలపై అధికారులతో ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి మాట్లాడారు. సమస్యలు ఉంటే పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రాజాగౌడ్, తహసీల్దార్ గజానన్, ఎంపీడీవో సాయిరాం, ఎంఈవోలు రాజాగంగారాం, నరేందర్, వివిధ మండలాలకు చెందిన అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి

కొనుగోలు చేసి ధాన్యానికి రూ.500బోనస్ ఇవ్వాలి

● ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి


మోర్తాడ్‌లో రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్, నవంబరు7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంతో ఆలస్యం చేసినందున రైతులు ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకుంటున్నారని, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. గురువారం మోర్తాడ్ మీదుగా వెళ్తూ మార్గమధ్యంలో ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకుంటున్న రైతుల వద్దకు వెళ్ళి మాట్లాడారు. మద్దతు ధర ఇస్తూ వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటికీ ప్రైవేటు వ్యాపారస్తులకు ఎందుకు విక్రయిస్తున్నారని ప్రశ్నించారు.దీంతో రైతులు వరి ధాన్యం కల్లాల వద్దకు వచ్చి 20రోజులు కావస్తున్న ప్రభుత్వం బోనస్ ఇచ్చి ధాన్యం కొనుగోలు చేస్తుందన్న నమ్మకం లేక ప్రైవేటు వ్యాపారులకు విక్రయించామని అన్నారు. దీంతో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని రకాల వడ్లకు రూ.500బోనస్ ఇచ్చి క్వింటాలుకు రూ.2800 కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల తో మాట్లాడిన అనంతరం ఆయన ఇతర గ్రామాలకు వెళ్ళిపోయారు. ఆయన వెంట మండల నాయకులు బోగ ఆనంద్, ఏనుగు రాజేశ్వర్‌రెడ్డి, ఏపీ గంగారెడ్డిలు ఉన్నారు.

రాష్ట్రస్థాయి మత్స్యశాఖ చైర్మన్‌ను కలిసిన ఎంవీఐ

వేల్పూర్, నవంబరు7(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండం లక్కోర గ్రామానికి చెందిన మోటర్ వెహికిల్ ఇన్స్‌పెక్టార్ ఉట్నూర్ సుబాష్ గురువారం హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర మత్స్యశాఖ చైర్మన్ మెట్టు సాయికుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంవీఐ సుబాష్ ఈ సందర్భంగా సాయికుమార్‌ను పూలబొకె ఇచ్చి శాలువతో సన్మానించి శుభాకంక్షలు తెలియజేశారు.

బాధితులకు సెల్‌ఫోన్‌ల అంతజేత

కోటగిరి,నవంబరు7(ఆంధ్రజ్యోతి): రుద్రూర్ మండలంలో సెల్‌ఫోన్‌లు పోగొట్టుకున్న బాధితులకు గురువారం ఎస్ఐ సాయన్న రికవరీ చేసిన సెల్ ఫోన్‌లను అందజేశారు. రాణంపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి మోహన్, సులేమాన్ ఫారంకు చెందిన మనోహర్, అంబం గ్రామానికి చెందిన సాయిలు సెల్‌ఫోన్‌లను పోగొట్టుకున్నారు. సీఐఆర్ పోర్టర్ సహాయం ద్వారా సెల్ ఫోన్‌లను రికవరీ చేసి బాధితులకు అందజేశారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపునకు కృషి చేయాలి

రెంజల్,నవంబరు7(ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ గెలుపునకు ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మొబిన్ ఖాన్ అన్నారు. గురువారం దూపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మండల స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కార్యకర్తలు గ్రామగ్రామాన పార్టీని బలోపేతం చేసి ఎన్నికలలో పార్టీ తరపున విజయం సాధించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ మాజీ మండల అధ్యక్షుడు సీహెచ్.రాములు, సాయిరెడ్డి, మార్కెట్‌కమిటీ మాజీ వైస్ చైర్మన్ ధనుంజయ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు శ్రీనివాస్, అంజయ్య, కాంగ్రెస్ పార్టీ మండల యూత్ అధ్యక్షులు కార్తీక్, మాజీ సర్పంచ్‌లు జావీదోద్దీన్, గణేష్, బాబన్న, కాంగ్రెస్ నాయకులు నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐని కలిసిన ఎస్సై

నవీపేట,నవంబరు7(ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ బుక్క శ్రీనివాస్‌ను గురువారం నవీపేట ఎస్ఐ వినయ్ మర్యాదపూర్వకంగా కలిశారు. గతంలో నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐగా పని చేసిన సతీష్ కుమార్ బదిలీ కాగా ఆయన స్థానంలో సీఐగా బుక్క శ్రీనివాస్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నూతన సీఐగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్‌కు పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

రామన్నపేట్‌లో జాతీయ విద్యార్థి దినోత్సవం

వేల్పూర్, నవంబరు7(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం రామన్నపేట్ గ్రామంలో అంబేద్కర్ యువ జన సంఘం ఆధ్వర్యంలో గురువారం జాతీయ విద్యార్థి దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అంబేద్కర్ విగ్రహనికి పీవైఎస్ ప్రధానకార్యదర్శి జంబావ చమార్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. 19వ శతబ్దంలో నవంబర్ 7వ తేదీన అంబేద్కర్ సంవత్సరంలో రాజవాడే చౌక్‌లోని ప్రతాప్‌సింగ్ ఉన్నత పాఠశాలలో అడ్మిషన్ తీసుకున్నారన్నారు. నేటికి 124సంత్సరాలు పూర్తయ్యిందన్నా రు. ఈ కార్యక్రమంలో పీవైఎస్ ఉపాధ్యక్షుడు ప్రవీన్, శివ, సున్ని, తదితరులు పాల్గొన్నారు.

సర్వే పత్రాల ఆన్‌లైన్ కోసం ఏర్పాట్లు

నవీపేట,నవంబరు7(ఆంధ్రజ్యోతి): సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు సంబంధించిన పత్రాల ఆన్‌లైన్ కోసం చేస్తున్న ఏర్పాట్లను గురువారం అధికారులు పరిశీలించారు. స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో 25కంప్యూటర్లు అందుబాటులో ఉన్నాయి. మరో రెండు రోజుల్లో ఇంటింటి సర్వే ప్రారంభం కానుండడంతో ఏ రోజుకు ఆ రోజు సర్వే పత్రాలను గ్రామాల వారిగా ఆన్‌లైన్ చేయడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయని అధికారులు పేర్కొన్నారు. పాలిటెక్నిక్ కళాశాలలో కంప్యూటర్లను పరిశీలించిన వారిలో తహసీల్దార్ వెంకట రమణ, ఎంపీడీవో నాగనాథ్, ఎంపీవో రామకృష్ణలు ఉన్నారు.

ఎమ్మెల్యే వివేక్ దిష్టిబొమ్మ దహనం

ఆర్మూర్‌టౌన్, నవంబరు7(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో నేతకాని మహార్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జాడి రమేష్ నేత మాట్లాడుతూ చెన్నూరు ఎమ్మెల్యే వెంకటస్వామి నేతకాని సమాజం పట్ల అనుచిత వ్యాఖ్యాలు చేయడం శోచనీయ మన్నారు. నేతకాని కులాన్ని మాలఉపకులంగా పరిగణించడం సిగ్గుచేటని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దుర్గం రాజేందర్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

రెంజల్ ఎంఈవోగా ఆంజనేయులు

రెంజల్,నవంబరు7(ఆంధ్రజ్యోతి): రెంజల్ మండల విద్యాశాఖ అధికారిగా జిల్లా పరిషత్ పాఠశాలలో గెజిటెడ్ హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న ఆంజనేయులు మండల విద్యాశాఖ అధికారిగా నియామకం అయినట్లు పీఆర్టీయూ అధ్యక్ష, కార్యదర్శులు సోమలింగంగౌడ్, కిషోర్‌కుమార్ తెలిపారు. మండలంలో సుదీర్ఘకాలంగా ప్రధానోపాధ్యాయుడిగా సేవలందించిన ఆంజనేయులుకు ఎంఈవో బాధ్యతలు అప్పగించడం హర్షనీయమన్నారు. శుక్రవారం మండల విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించనున్నట్లు వారు తెలిపారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ క్రీడలకు హసాకొత్తూర్ విద్యార్థుల ఎంపిక

కమ్మర్‌పల్లి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని హసాకొత్తూర్ పాఠశాలకు చెందిన 8వ తరగత విద్యార్థులు,రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ క్రీడలకు ఎంపిక అయినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృష్ణకుమార్, ఫిజికల్ డైరెక్టర్ మాధురి తెలిపారు.ఆలూర్ మండలం కల్లెడలో జరిగిన జిల్లాస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో క్రీడా ప్రతిభకనబర్చిన మంద ప్రతిభా, జుంబెరాత్‌అను రామ్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ నెల 8,9, తేదీలలో సిద్దిపేటలో జరుగనున్న రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ఈ విద్యార్థులు పాల్గొననున్నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనా విద్యార్థులు మంద ప్రతిభ, జుంబెరాత్‌అనురామ్‌లను గురువారం పాఠశాలలో అభినందిం చి రాష్ట్రస్థాయిలో ప్రతిభను కనబర్చి జాతీయస్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు



లింగంపల్లి కొనుగోలు కేంద్రంలో ధాన్యం కుప్పలు

ఫోకస్

లింగంపల్లిలో నిలిచిన కొనుగోళ్లు

- రోడ్డు బాగు లేక.. వడ్ల లారీలు రాక నిలిచిన కొనుగోళ్లు
- రోడ్డు కుంగిపోయి వాహనాల రాకపోకలకు అంతరాయం
- పట్టించుకోని అధికారులు
- అవస్థలు పడుతున్న రైతులు

నాగిరెడ్డిపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగంపల్లికి వెళ్లే రోడ్డు చెడిపోవడంతో గ్రామానికి వడ్ల లారీలు రాక గ్రామంలో వడ్ల కొనుగోళ్లు గురువారం నిలిచిపోయాయి. గ్రామంలో వడ్ల కోతలు ప్రారంభమై నెల రోజులు కాగా, వడ్ల కొనుగోలు కేంద్రానికి రైతులు ధాన్యాన్ని తీసుకువచ్చి సుమారు నెల రోజులైనా, నాలుగైదు రోజుల క్రితమే ధాన్యం కొనుగోలు కేంద్రంలో వడ్ల కొనుగోళ్లను ప్రారంభించారు. గ్రామానికి వెళ్లే రోడ్డుపై నేలమోరి ఉంది. రోడ్డు పక్క నుంచే పోచారం ప్రధాన కాలువ ప్రవహిస్తోంది. వర్షా కాలంలో అత్యధిక వర్షాల కారణంగా ఈ నేల మోరి వద్ద రోడ్డు వద్ద గుంత ఏర్పడి రోడ్డు బాగా కుంగిపోయింది. దీంతో అప్పట్లో నీటి పారుదల శాఖ అధికారులు తాత్కాలిక రోడ్డుకు మరమ్మతులు జరిపారు. ఇటీవల కురిసిన అకాల భారీ వర్షాల కారణంగా మరమ్మతులు జరిపిన రోడ్డు వద్ద తిరిగి రోడ్డు కుంగిపోయింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. రోడ్డు బాగా లేకపోవడంతో వడ్ల లారీలు గ్రామానికి రావడం లేదు. ఇటీవల వడ్ల కొనుగోళ్ల ప్రారంభం కాగా కేవలం గ్రామానికి రెండు వడ్ల లారీలు రాగా, రోడ్డు బాగా లేకపోవడంతో దారి మళ్లించి తాండూరు గ్రామం మీదుగా ఈ వడ్ల లారీలను ఎలా గోలా రైస్‌మిల్లుకు పంపించారు. తాండూర్ రోడ్డు నుంచి కూడా వడ్ల లారీలు వెళ్లేందుకు సరైన అవకాశం లేకపోవడం లింగంపల్లి రోడ్డు బాగు లేకపోవడంతో గ్రామానికి వడ్ల లారీలు రావడం నిలిచిపోయాయి. దీంతో గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద వడ్లకు కాటా చేసిన వడ్ల బస్తాలు గత మూడు రోజులుగా లారీలు రాక కొనుగోలు కేంద్రం వద్దనే నిల్వ ఉన్నాయి. లారీలు రాకపోవడంతో ధాన్యం కొనుగోలు కేంద్రంలో గురువారం ధాన్యం తూకం వేయడాన్ని అర్ధాంతరంగా నిలిపివేశారు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మాల్తుమ్మెద సొసైటీ పరిధిలో లింగంపల్లి గ్రామం ఉండటంతో గ్రామంలో సొసైటీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోళ్ళు నిలిచిపోవడంతో రైతన్నలు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. రోడ్డును తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టే విషయంలో సంబంధిత అధికారులు గాని, సొసైటీ అధికారులు గాని ఏ మాత్రం పట్టించుకోవడం లేదని రైతులు విమర్శిస్తున్నారు. రోడ్డుకు ఎప్పుడు మరమ్మతులు చేస్తారో, గ్రామానికి ఎప్పుడు వడ్ల లారీలు వస్తాయని రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. సంబంధిత ఆర్‌అండ్‌బీ అధికారులు గాని, నీటి పారుదల శాఖ అధికారులు గాని, సొసైటీ అధికారులు గాని వెంటనే తగు చర్యలు తీసుకుని రోడ్డును వెంటనే మరమ్మతులు చేపట్టి గ్రామానికి వడ్ల లారీలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని గ్రామ రైతులు కోరుతున్నారు.

వడ్ల కొనుగోళ్లు నిలిచిపోయాయి



● కొండిగారి పోశయ్య, రైతు, లింగంపల్లి

గ్రామానికి వచ్చే రోడ్డు బాగా లేకపోవడంతో, వడ్ల లారీలు రాక గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనుగోలు నిలిచిపోయాయి. కేంద్రానికి తమ ధాన్యాన్ని తీసుకువచ్చి సుమారు నెల రోజులవుతుంది. ఐదారు రోజుల కిందనే కాటా ప్రారంభించారు. ప్రస్తుతం కాంటా నిలిపివేశారు. అధికారులు వెంటనే రోడ్డును బాగు చేయాలి.

రోడ్డు బాగా లేక లారీలు వస్తలేవు



● బుచ్చమొల్ల సాయిలు, రైతు, లింగంపల్లి

రోడ్డు చెడిపోయి గ్రామానికి వడ్ల లారీలు వస్తలేవు. తనకున్న మూడు ఎకరాలలో వరి పంటను సాగు చేసి వడ్లను నెల రోజుల క్రితం ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చాను. రోడ్డు చెడిపోవడంతో వడ్ల లారీలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేపట్టి గ్రామానికి వడ్ల లారీలు వచ్చేలా చర్యలు తీసుకోవాలి.



లింగంపల్లికి వెళ్లే రోడ్డు నేల మోరి వద్ద కుంగిపోయిన లింగంపల్లి రోడ్డు



పార్థివవాహనం

ఆపద సమయంలో ఆర్థిక తోడ్పాటు

- బడుగు, బలహీన వర్గాలకు పార్థివ వాహన సేవలు
- ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం కృషి

సదాశివనగర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశపెట్టిన పార్థివ వాహన సేవలు పేద, మధ్యతరగతి, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు వరంలా మారాయి. వివిధ రకాల ప్రమాదాల్లో, ఆసుపత్రుల్లో మరణించిన వారి మృతదేహాలను ఇంటికి చేరవేసేందుకు పార్థివవాహనం ఎంతో ఉపయోగకరంగా మారింది. మృతదేహం తరలించేందుకు ప్రైవేట్ వాహనాలను, అంబులెన్స్‌లను ఆశ్రయిస్తే జాలి చూపకపోగా వేలకు వేలు డబ్బులు డిమాండ్ చేయడం వల్ల పేదలు చావు సమయంలో కూడా ఆర్థిక భారం మరింత మోయాల్సిన పరిస్థితి ఈరోజుల్లో జరుగుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో అంత్యక్రియల నిర్వహణలో భాగంగా కొంత ఆర్థిక భారం తగ్గించడానికి ప్రభుత్వం ఈ పార్థివవాహన సేవలు అందుబాటులోకి తేవడం అనేక కుటుంబాలకు ఉపయోగంగా మారింది.

ఉమ్మడి జిల్లాలో అందుబాటులో

నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఈ వాహనాలు అందుబాటులో ఉన్నాయి. ఆసుపత్రులలో చనిపోయిన వారి మృతదేహాలను ఉచితంగా ఎలాంటి డబ్బులు తీసుకో కుండా వారి ఇంటికి పార్థివ వాహనం ద్వారా మృతదేహాన్ని తరలి స్తారు. వ్యక్తిమరణించిన తర్వాత ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను గాని, సిబ్బందిని గాని సంప్రదిస్తే ఈ వాహన వివరాలు తెలుస్తాయి.

24 గంటలు అందుబాటులో ఉంటాయి



● మధుకుమార్, ప్రోగ్రాం మేనేజర్

ఈ సేవలు పొందడానికి 108 లేదా ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు సమాచారం అందించి ఈ సేవలు పొందవచ్చు. ఈ సేవలు ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో ఉంటాయి.

పేదలు సద్వినియోగం చేసుకోవాలి



● బి.తిరుపతి, జిల్లా మేనేజర్

పేద, మధ్య తరగతి ప్రజలు వారి కుటుంబ సభ్యులు ఎవరైనా చనిపోతే అంత్యక్రియలు నిర్వహించే స్తోమత లేక ఇబ్బందులు పడుతున్నారు. అలాంటి వారికి మృతదేహం తరలించేందుకు ఆర్థిక భారం పడుతుంది. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పార్థివ వాహనం సేవలు అందుబాటులో వచ్చాయి. పేద, మధ్య తరగతి ప్రజలు ఈ సేవలను వినియోగించుకోవాలి.

ఎత్తిపోతలు కాదు.. ఉత్తిపోతలే!

- పనిచేయని బర్దీపూర్ లిఫ్ట్
- ప్రభుత్వం పట్టించుకోవాలని రైతుల వేడుకోలు

డిచ్‌పల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బర్దీపూర్ లిఫ్ట్ ఆయకట్టు రైతులకు గుదిబండలా మారింది. ఆదుకుంటుందన్న లిఫ్ట్ చెడిపోయి మూలన పడడంతో అన్నదాతలకు అన్నమో రామచంద్ర అనే పరిస్థితులు దాపురించాయి. మండలంలోని బర్దీపూర్ ఎత్తిపోతల పథకం 2వేల ఎకరాలకు సాగు నీరు అందించేందుకు గతంలో కాంగ్రెస్ హయంలో ఈ ఎత్తిపోతల పథకం ప్రారం భించారు. ఈ లిఫ్ట్ పాలకుల నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం కారణంగా పూర్తిగా నిరుపయోగంగా మారి మూలన పడింది. కోట్లాది రూపాయలతో రైతాంగానికి సాగు నీరు అందించాలనే ఉద్దేశంతో నాటి సీఎం వైఎస్‌రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించిన ఎత్తిపోతల పథకం ఆలనపాలన కరువైంది. ఎత్తిపోతలతో నమ్ముకున్న రైతాంగం ఆశలు అడిఆశాలు కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ లిఫ్ట్ ద్వార బర్దిపూర్, ధర్మారం, కమలాపూర్, ఘన్‌పూర్, మిట్టపల్లి, బీబీపూర్, గ్రామాల రైతుల ఆశాలు సన్నగిల్లాయి. లిఫ్ట్ 5ఎంవీ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి రెండున్నర ఏళ్లు గడిచిన ఇంత వరకు విద్యుత్ శాఖ అధికారులు కొత్త ట్రాన్స్‌ఫార్మర్ బిగించకపోవడంతో ఆయకట్టు రైతులు మండిపడుతున్నారు. ఎత్తిపోతల పర్యవేక్షణ అధికారులు తమకేమి పట్టనట్లు వ్యవహరించడంతో విలువైన మోటార్లు పని చేయకుండా మూలన పడ్డాయి, ఇప్పటికే దొంగలు ఇనుపగేట్‌లను చోరీ చేయగా కొంత మంది ఎత్తిపోతల పథకం వద్ద పేకట స్థావరంగా మార్చుకున్నారు. ఇప్పటి కైన కాంగ్రెస్ ప్రభుత్వంలోని పాలకులు స్పందించి లిఫ్టని పునర్ నిర్మాణం చేయాలని, లిఫ్ట్ ద్వారా సాగునీరు అందేల చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో నిర్మించిన ఈ లిఫ్ట్ బీఆర్‌ఎస్ పాలకులు పట్టించుకోలేదని, తిరిగి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని లిఫ్టను పునర్ నిర్మాణం చేసి ఆయకట్టు భూములకు సాగు నీరు అందిస్తారని రైతులు ఆశా భావం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవలే ఈ విషయంలో రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి దృష్టికి రైతులు ఈ విసయం విన్నవించారు. అయిన పలితం కనబడలేదు.



మూలన పడ్డ బర్దీపూర్ లిఫ్ట్



వృథాగా ఉన్న పంపు హౌస్



ట్రాన్స్‌ఫార్మర్ లేక ఖాళీగా ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్

పేద విద్యార్థినులకు వరం.. కస్తూర్బా విద్యాలయం

వేల్పూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): చదువుకోవాలన్న ఆసక్తి ఉంటుంది.. కానీ కుటుంబ పరిస్థితులు అనుకులించవు. బడికి వెళ్లాలన్న కోరిక ఉంటుంది. కానీ స్తోమత సహకరించదు. ఏలాగోలా బడికి వెళ్తన్న మధ్యలోనే మానేయాల్సిన దుర్భర పరిస్థితి. ఇలాంటి వారెందరినో హక్కున చేర్చుకొని అన్ని వసతులు సమకూర్చి, నాణ్యమైన విద్యను అంది స్తున్నాయి కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలు. కుటుంబ పరిస్థితులు అనుకూలించక ఆర్థిక ఇబ్బందులతో చదువు మానివేసిన బాలికలకు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల వ్యవస్థ వరంలా మారింది. పేదరికం, ఆర్థిక సమస్యలు, ఇతరాత్ర కారణాలతో గ్రామాల్లో బాలిలను చదివించ డానికి తల్లిదండ్రులు పెద్దగా ఆసక్తి చూపేవారు కాదు. ఇక దూరంగా పంపించి చదివించడం అంటే చాలా కష్టం. అందుకే చాలా మంది తమ ఆడబిడ్డలను చదువుకు దూరం చేసి ఇంటికే పరిమితం చేస్తున్నారు. పనులకు పంపిస్తు న్నారు. అయితే ఇలా మధ్యలో చదువు మానివేసిన బాలికలు తల్లిదండ్రులు లేని చిన్నారులను కేజీబీవీ హక్కున చేర్చుకొని విద్యావంతులుగా తీర్చిదిద్దుతోంది. వేల్పూర్ మండల పచ్చలనడ్కుడ గ్రామ శివారులోని జాన్కంపేట్ గ్రామం వద్ద కస్తూర్బా విద్యాలయంలో చదువుతున్న 217మంది బా లికది ఒక్కోక్కరికి ఒక్కో నేపథ్యం పేదరికంతో బడిమానేసిన వారు ఒకరైతే, తల్లిదండ్రులకు దూరమై పాఠశాకు దూరమైన వారు మరొక్కరు. ఒక్కొక్కరికి ఒక్కో బాధ. ఎన్ని ఇబ్బందులు ఉన్న చదువుకోవాలన్నదే వారి ఆశ. చదవాలన్న వారి ఆసక్తికి అనుగుణంగా బాలికల బంగారు భవిష్యత్తుకు ఇక్కడి కస్తూర్బా విద్యాలయం బాటలు వేస్తుంది. ఈ కేజీబీవీలో గత నాలుగేళ్ల నుంచి వంద శాతం ఉత్తీర్ణత సాధిస్తూ క్రీడల్లో బాగా రాణిస్తున్నారు. ఈ నేపథ్యంలో పలువురు విద్యార్థినుల అభిప్రాయాలు..



భోజనం చేస్తున్న కేజీబీవీ విద్యార్థినులు

ఇక్కడ వసతులు బాగున్నాయి



● కమూడి హన్సిక, 10వ తరగతి, శ్రీరాంపూర్

మాది బాల్కొండ మండలం శ్రీరాంపూర్ గ్రామం. మా తల్లిదండ్రులు ఇద్దరు ఆర్మూర్‌లోని షాపుల్లో కూలీ పనులు చేసుకుంటున్నారు. ఆర్థిక పరిస్థితి బాగా లేదు. చదవాలన్న నానా కోరిక మేరకు నాన్న ఇక్కడ చేర్పించారు. ఈ విద్యాలయంలో అన్ని వసతులు కల్పిస్తున్నారు. నాలాంటి విద్యార్థులకు వరంలా మారింది.

కష్టపడి చదువుకొని ఉన్నత ఉద్యోగం సంపాదిస్తా



● సీహెచ్. నవ్యశ్రీ, 9వ తరగతి, ఆర్మూర్

మాది ఆర్మూర్. మా నాన్న ఆర్మూర్‌లో పీవోపీ షాప్ నడుపుకుంటూ నన్ను చదివిస్తున్నాడు. ఆర్థిక పరిస్థితి బాగా లేక లేనందున చదువుపై తనకు ఉన్న ఆసక్తితో మా తల్లిదండ్రులు ఇక్కడి కేజీబీవీ పాఠశాలలో నాన్ను చేర్పించారు. ఇక్కడ వసతులతో పాటు విద్యబోదన బాగానే ఉన్నాయి. తాను చక్కగా చదువుకుంటున్నా.

నేను వ్యవసాయ పనులకు వెళ్లేదాన్ని



● శివ సాత్విక, 8వ తరగతి

మాది భీమ్‌గల్ గ్రామం. మా తల్లిదండ్రులు వ్యవసాయ కుటుంబానికి చెందిన వారు. నేను తరచుగా వ్యవసాయ పనులకు కూడా వెళ్లేదాన్ని. చదువు పట్ల నాకున్న ఆసక్తిని గమనించిన నా తల్లిదండ్రులు నన్ను ఇక్కడి పాఠశాలలో చేర్పించారు. తల్లిదండ్రుల ఆశయం మేరకు వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా మంచిగా చదువుకొని ప్రభుత్వ ఉద్యోగం సంపాదిస్తా.



వేల్పూర్ మండలంలోని జాన్కంపేట వద్ద గల కేజీబీవీ భవనం

ఉద్యోగం సాధించి పిన్ని, బాబాయిల పేరు నిలబెడతా



● కందకుర్తి అన్నపూర్ణ, మాక్లూర్, 9వ తరగతి

అమ్మనాన్నలను కోల్పోయి అనాథగా ఉన్న నాకు పిన్నీ, బాబాయ్ రేవతి, రవిలు నన్ను ఇక్కడి పాఠశాలలో చేర్పించారు. చదువుకోవాలన్న తపన నాకు ఉందన్న విషయాన్ని వారు గమనించి ఈ పాఠశాలలో చదివిస్తున్నారు. భవిష్యత్తులో నేను బాగా చదివి ఉన్నత ఉద్యోగం సాధిస్తా.. పిన్ని, బాబాయిల పేరు నిలబెడతా.

పేద బాలికలకు కేజీబీవీ మంచి అవకాశం



● వినోద, కేజీబీవీ ప్రత్యేక అధికారిణి

ఆర్థిక ఇబ్బందులు ఇతర కారణాలతో మధ్యలో చదువు మానేసిన పేద బాలికలు చదువుకునేందుకు కేజీబీవీలు ఎంతగానో దోహదపడుతున్నాయి. బాలికలు ఉన్నత విద్య వైపు అడుగులు వేస్తున్నారు. మంచి విద్య, క్రమశిక్షణతో పాటే ఆహారం, ఆరోగ్యం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. అన్ని వసతులు కల్పిస్తున్నాం. 10వ తరగతిలో గత నాలుగేళ్లుగా సాధించిన వంద శాతం ఉత్తీర్ణతను ఈ ఏడాది కూడా సాధించేందుకు ప్రయత్నిస్తున్నాం.

రక్తదానానికి యువకులు ముందుకురావాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

కామారెడ్డిటౌన్,నవంబరు 7(ఆంధ్రజ్యోతి): తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల ప్రాణాలను కాపాడాలనే ఉద్దేశ్యంతో కామారెడ్డి మున్సిపల్‌లో శుక్రవారం నిర్వహించే రక్తదాన శిబిరానికి యువకులు పెద్దఎత్తున హజరుకావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం శిబిరానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు.ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు రక్తదాన శిబిరం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.ప్రభుత్వ సలహదారుడు షబ్బీర్‌అలీ సైతం ఈ శిబిరంలో పాల్గొననున్నారని తెలిపారు. రక్తదానం చేయాలనుకునే వారు 9492874006 నంబర్‌కు సంప్రదించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా సమన్వయకర్త బాలు, రక్తదాతల సముహ అధ్యక్షుడు వేద ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిని సస్పెన్షన్ చేయడం అప్రజాస్వామికం

కామారెడ్డిటౌన్,నవంబరు 7(ఆంధ్రజ్యోతి):నిర్మల్ జిల్లా దిలావర్పూర్ ఇథనాల్ కంపెనీ ఏర్పాటుకు వ్యతిరేకంగా ప్రజలు చేస్తున్న ప్రజాస్వామిక ఉద్యమానికి అండగా నిలిచిన ఉపాధ్యాయుడు, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు విజయ్ కుమార్‌ను సస్పెండ్ చేయడం అప్రజాస్వామికమని తెలంగాణ పీపుల్స్ జేఏసీ నాయకులు రమణ, వేణు గోపాల్, జగన్నాథం, నర్సింహరెడ్డి అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలల్లో ప్రజాస్వామ్య పునరుద్ధరణ కూడా ఉందనే సంగతి మర్చిపోకూడదని అన్నారు. వెంటనే విజయ్‌కుమార్‌పై సస్పెన్షన్ ఎత్తివేయాలని ప్రజాస్వామ్యాన్ని ప్రజాఉద్య మాలను గౌరవించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

ధైర్యంగా పోరాడి విజయం సాధించాలి



మాట్లాడుతున్న రమేశ్ చైతన్య

దోమకొండ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి):ప్రతి ఒక్కరు జీవితంలో కష్టాలను సవాళ్లను అధిగమించి ధైర్యంగా ముందుకు వెళ్లి విజేతలుగా నిలిచి నలుగురికి ఆదర్శంగా ఉండాలని ఇన్‌ప్యాక్ట్ సర్టిఫైడ్ ట్రైనర్, స్పీకర్ రమేశ్ చైతన్య అన్నారు. దోమకొండ కస్తూర్బ కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. జీవితంలో లక్ష్యాలు, సవాళ్లు అనే అంశంపై ఆయన మాట్లాడారు. సమస్యలు అనేవి ప్రతి ఒక్కరికి ఉంటాయని కాని అవి మనం ఎలా స్వీకరిస్తాం అనే దాని పైన మన విజయం ఆధారపడి ఉటుందని అంతేకానీ భయపడి ఆత్మహత్యలకు పాల్పడితే ఇటు కన్నవారికి, అటు సమాజానికి తీరని నష్టం జరుగుతుందని సూచించారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ లక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో వృద్ధురాలి ఆత్మహత్య

గాంధారి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): గాంధారి మండలం గండివేట్ గ్రామానికి చెందిన ధ్యానబోయిన నాగవ్వ(71) ఆత్మహత్యచేసుకున్నట్లు ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపారు. గత కొన్నినెలలుగా అనారోగ్యంతో బాధపడుతూ ఉండేదని బుధవారం డాక్టర్ వద్దకు వెళ్లానని చెప్పి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని తెలిపారు. నాగవ్వ కూమా రుడు భాస్కర్ ఆమెను వెతుక్కుంటూ సీతాయిపల్లి వైపుగా వెళ్లగా పీర్లబావి వద్ద నాగవ్వ చెప్పులు ,ఆమె బ్యాగు కనపడడంతో చుట్టుపక్కల వెతికారు. గురువారం ఉద యం నాగవ్వ మృతదేహం లభ్యమవడంతో పోలీసులకు సమాచారం అందించారు.మృతురాలి కూమారుడు భాస్కర్ ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ వివరించారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

సదాశివనగర్,నవంబరు 7(ఆంధ్రజ్యోతి):మండలంలోని కల్వరాల్ పాఠశాలలోని విద్యార్థులకు జిల్లా అంధత్వ నివారణసంస్థ,ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించినట్లు నేత్రవైద్యసహాయకుడు హరికిషన్‌రావు తెలిపారు.68 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించగా 6గురు విద్యార్థులకు దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించడం జరిగిందని వారికి కంటి అద్దాలు అవసరమని వాడాలని తెలిపారు. ముగ్గురు విద్యార్థులకు పోషకాహార లోపాలు ఉన్నట్లు గుర్తించి వారికి పోషకాహారం తీసుకోవాలని తెలిపారు.విద్యార్థులు ఎక్కువసేపు టీవీలు, ఫోన్‌లు చూడడం ద్వారా కంటి సమస్యలుతలెత్తుతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే కోఆర్డినేటర్ మారుతిబాబు,పాఠశాల ప్రధానోపాధ్యాయులు విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బంజరా భాషను గోర్‌బోలిగా నమోదుచేయాలి

రాజంపేట,నవంబరు 7(ఆంధ్రజ్యోతి): బంజరాభాషను గోర్‌బాలిగా నమోదుచేయాలని లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్రకార్యదర్శి వినోద్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సామాజిక,ఆర్థిక కులగణనలో బంజరాబాష మాటాడే ప్రతి బంజరా తమ మాతృబాష గోర్‌బోలి నమోదుచేసుకోవాలని ఫారంలో పదో ప్రశ్న మాతృబాషను నమోదుచేసుకోవాలని తెలిపారు.

సమస్యల వలయంలో నసురుల్లాబాద్ బస్టాండ్

● తాగునీరు ..మరుగు దొడ్ల సౌకర్యాలు కరువు ● ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు ● పట్టించుకోని సంబంధిత అధికారులు



నసురుల్లాబాద్ బస్టాండ్ ఇదే



శిథిలావస్థలో దుర్కి బస్టాండ్

నసురుల్లాబాద్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్టాండ్‌లో సౌకర్యాలు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. నసురు ల్లాబాద్ మండల పరిధిలోని నిజామాబాద్ - బాన్సు వాడ - బోధన్ - హైదరాబాద్ వెళ్లే ప్రయాణికులు మండల కేంద్రమైన నసురుల్లాబాద్ బస్టాండ్‌లో ప్రయాణికులకు మరుగుదొడ్లు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కనీసం మండల కేంద్రమైన బస్టాండ్‌లో చుట్టూ పక్క మండలాలే కాకుండా ఇతర గ్రామాల నుంచి వచ్చి ప్రయాణికులకు బ స్సుల కోసం ఎదురు చూస్తుంటే, సమయానికి బస్సులు రాకపోవ డం తో మూత్రశా లలు, మరుగుదొడ్లు లేక పరయాణికులు ఇబ్బందుల కు గురవుతున్నట్లుప్రజలు ఆరోపిస్తు న్నారను. అలాగే మండల పరి దిలోని కాంశెట్‌పల్లి, దుర్కి గ్రామాలలో, బస్టాండ్‌లు, శిథిలా వస్థలోకి చేరడం తో ప్రయాణికులు కనీసం నిల్చుందామంటే నీడ లేక రోడ్డుపైనే ప్రయాణికులు గంటల తరబడి వేచి చూస్తున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు, గ్రామాలలో ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా శిథిలావస్థలోకి చేరిన బస్టాండ్ మరమ్మతులు చేసి ప్రజలకు అందుబాటులో తీసుకురావాలని మండలప్రజలు కోరుతున్నారు. అలాగే నూతన ప్రభుత్వం ఏర్పాటైన తరువాత కూడా ప్రజల సౌకర్యా లు పట్టించుకోవడం లేదని, నిత్యం ప్రయా ణించే ప్రయాణికుల ఇబ్బందులు గమనించి, ఆర్టీసీ అధికారులు ప్రజలకు, ఆర్టీసీ ప్రాంగ ణంలో మరుగుదొడ్లు నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ప్రయాణికులు కోరుతున్నారు.

బస్టాండ్‌లో సౌకర్యాలు కల్పించాలి

నసురుల్లాబాద్ ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించాలి. తరచూ ప్రయాణికులు నసురుల్లాబాద్ నుంచి బోధన్ - నిజామాబాద్ - హైదరాబాద్‌కి తరలివెళుతుంటారు. కాని బస్టాండ్‌లో కనీస సౌర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నాం.

- సాయి, ప్రయాణికుడు

టూరిజం ఏర్పాటుకు స్థలం అప్పగింత



టూరిజం ఏర్పాటుకు స్థలాన్ని అప్పగిస్తున్న దృశ్యం

నిజాంసాగర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నిజాంసాగర్ ప్రాజెక్టు పరిసర ప్రాంతాల్లో టూరిజం ఏర్పాటు చేసేందుకు గురువారం స్థలాన్ని టూరిజం అభివృద్ధి కార్పొరేషన్ హైదరాబాద్ ఎస్టేట్ అధికారి రామ్మూర్తికి తహసీల్దార్ భిక్షపతి, నీటి పారుదల శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ శివప్రసాద్‌ను గోల్‌బంగ్లా సమీపంలో గల సర్వే నెం.121లోని 12 ఎకరాల ఐదు గుంటల భూమిని అప్పగించారు. రాష్ట్ర ప్రభుత్వం నిజాంసాగర్ టూరిజం ఏర్పాటు చేసేందుకు ముందడుగు వేయడంతో జిల్లా పాలన అధికారి రెవెన్యూ అధికార యంత్రాంగం గోల్‌బంగ్లా సమీపంలో స్థలాన్ని ఎంపిక చేసిన విషయం విదితమే. టూరిజం హైదరాబాద్ ఎస్టేట్ అధికారి స్థలం అప్పగింత ఉత్తర్వులను అందుకున్నారు. నిజాంసాగర్ ప్రాచీక కట్టడాలతో పాటు గోల్‌బంగ్లా సమీపంలో టూరిజం ఏర్పాటు ప్రక్రియ ప్రారంభించేందుకు ఎవరి చేతుల మీదుగా శంకుస్థాపన చేస్తారనే ప్రశ్నార్థకమే. నిజాంసాగర్ ప్రాజెక్టు టూరిజం ఏర్పాటు అయితే పర్యాటకులు కనీససౌకర్యాలు మెరుగవుతాయని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈ శివప్రసాద్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు మల్లికార్జున్, నాయకులు సంకు లక్ష్మయ్య, బంగ్లా ప్రవీణ్‌కుమార్, మంగలి కృష్ణ, బంగ్లా గోపాల్, గాండ్ల రమేష్‌లు ఉన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు నలుగురు విద్యార్థుల ఎంపిక



రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నాగిరెడ్డిపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపాల్‌పేట్, బొల్లారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు చెందిన నలుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు ఆయా పాఠశాలల పీడీ సబాత్ కృష్ణ, పీఈటీ సుకుమార్‌గౌడ్‌లు గురువారం తెలిపారు. గోపాల్‌పేట్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు అర్చన, మల్దీప్‌సింగ్‌లు రాష్ట్రస్థాయి నెట్‌బాల్ క్రీడా పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈనెల 9న నిర్మల్‌లో జరగబోయే రాష్ట్రస్థాయి నెట్‌బాల్ క్రీడా పోటీలలో ఈ విద్యార్థులు పాల్గొనున్నట్లు తెలిపారు. అలాగే బొల్లారం హైస్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. అండర్-14 ఖోఖో పోటీలకు విద్యార్థి కిషణ్, అండర్ -17 ఖోఖో పోటీలకు విద్యార్థి నవీన్‌లు ఎంపికైనట్లు పీఈటీ సుకుమార్‌గౌడ్ తెలిపారు. రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు మండల విద్యార్థులు ఎంపిక కావడం పట్ల మండల విద్యాధికారి భాస్కర్‌రెడ్డి, గోపాల్‌పేట్ హైస్కూల్ హెచ్‌ఎం వెంకట్ రామిరెడ్డి,విద్యార్థులను అభినందించారు.

ఖోఖో పోటీలకు గురుకుల విద్యార్థుల ఎంపిక

మద్నూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఈనెల 6న కంజర్ గ్రామంలో జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఖోఖో పోటీలలో కామారెడ్డి జిల్లా మద్నూర్ గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానం సాధించారు. ఈనెల 15, 16, 17న వికారాబాద్ జిల్లాలోని తాండూరులో జరగబోయే రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలలో అండర్-14 నుంచి శ్రీకాంత్ రాజు, అండర్ -17 నుంచి సీహెచ్ కరణ్, రుతిక్, జగదీష్, మద్నూర్ తెలంగాణ బాలుర గురుకుల విద్యార్థులు ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన విద్యార్థులకు పాఠశాల ప్రిన్సిపాల్ గంగాకిషోర్, అసిస్టెంట్ ప్రిన్సిపాల్ సుమన్, పి.ఈటీ గణేష్, ఉపాధ్యాయులు సంతోష్‌లు సన్మానించి అభినందించారు.

బీడీ కార్మికులకు జీవనభృతి అందించాలి

రాజంపేట,నవంబరు 7(ఆంధ్రజ్యోతి):బీడీ కార్మికులకు రూ.4016 జీవనభృతి అందించాలని బీఎల్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సిద్దిరాములు అన్నారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా లక్షలాదిమంది బీడీ కార్మికులకు షరతులు లేకుండా జీవనభృతి అందించాలని డిమాండ్ చేస్తు మండల కేంద్రంలోని ర్యాలీ నిర్వహించారు. బీడీ కార్మికులు ఐక్యంగా సంఘటితంగా ఉద్యమించాలని, జీవనభృతి సారించే వరకు పోరాటం సాగించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు ఎల్లయ్య, ఆంజనేయులు, వెంకటలక్ష్మీ,అనసూయ,లింగం తదితరులు పాల్గొన్నారు.

మోటార్లకు కెపాసిటర్లు బిగించుకోవాలి

బీర్కూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండల కేంద్రంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో పొలం బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ ఇంచార్జి డీఈ ప్రభాకర్‌రావు రైతులతో కలిసి పొలాలను సందర్శించారు. కెపాసిటర్లు బిగించుకోవడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి డీఈ రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్‌శాఖ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్యార్వీ పండుగ



దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ఆటో డ్రైవర్లు

నాగిరెడ్డి పేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆటో యూనియన్ ఆధ్వర్యంలో గురువారం గ్యార్వీ పండుగను ఘనంగా నిర్వహించారు. గోపాల్‌పేట్-ఎల్లారెడ్డి రూట్‌లో ఆటోలు నడిపే డ్రైవర్లు, ఆటో యూనియన్ ఆధ్వర్యంలో గ్యార్వీ పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేసి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గత కొన్ని సంవత్సరాలుగా ఆటో యూనియన్ ఆధ్వర్యంలో గ్యార్వీ పండుగను నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో మండల ఆటో యూనియన్ అధ్యక్షుడు మహ్మద్ యూసుఫ్, ఉపాధ్యక్షుడు సాబేర్ తదితరులు పాల్గొన్నారు.

నెమలి సాయి ఆలయంలో పూజలు

నసురుల్లాబాద్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నసురుల్లాబాద్ మండలంలోని నెమలి ఆలయంలో గురువారం భక్తులు సాయి ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు మాట్లాడుతూ నెమిలి సాయి ఆలయం మినీ షిరిడిగా అవతరించిందన్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

కాలభైరవ స్వామి ఉత్సవాలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం

రామారెడ్డి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): దక్షిణ కాశీగా విరాజల్లుతున్న ఇసన్నపల్లి - రామారెడ్డి గ్రామాల మధ్య వెలిసిన శ్రీ కాలభైరవ స్వామి జన్మదిన వేడుకలకు హాజరు కావాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే కె.మదన్ మోహన్‌రావుకు ప్రత్యేకంగా ఆలయ సూపరింటెండెంట్ బుర్ల ప్రభురామచంద్రం గుప్త, ప్రధాన పురోహితులు శ్రీనివాస్ శర్మ కలిసి విన్నవించారు.

విరాళం అందజేత

దోమకొండ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగుపల్లి గ్రామంలోని హరిజనవాడలో పోచమ్మ పునఃప్రతిష్ఠన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అమ్మవారి ఆలయ పునఃప్రతిష్ఠపనకు మండల కేంద్రానికి చెందిన ఐరేని నర్సయ్య గురువారం రూ. 5 వేల విరాళం అందజేశారు.

కొనుగోలు కేంద్రాల్లో అన్ని వసతులు ఏర్పాటు చేశాం

● సీఈవో పన్యాల బాల్‌రెడ్డి

దోమకొండ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి):దోమకొండ విండో పరిధిలోని అంచనూర్, సీతారాంపూర్, సంగమేశ్వర్, మాందాపూర్, లింగుపల్లి, దోమకొండ గ్రామాల్లోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అన్ని వసతులు ఏర్పాటు చేసినట్లు సీఈవో పన్యాల బాల్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని సీతారాంపూర్ గ్రామంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. మైచర్ వచ్చిన రైతుల యొక్క ధాన్యాన్ని సీరియల్ ప్రకారం కాంట చేయడం జరుగుతుందని, లారీలు అందుబాటులో ఉన్నాయన్నారు. సెంటర్ నిర్వహకులకు రైతులు సహకరిస్తు ధాన్యాన్ని కాంట చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సెంటర్ ఇంచార్జ్ ధరిపల్లి జైపాల్‌రెడ్డి, మైచర్ ఇంచార్జ్ నత్తి సురేష్, రైతులు ముదాం శంకర్, ఆసాని జీవన్‌రెడ్డి, బీరయ్య, హనుమంత్‌రావు, , తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లకు నిబంధనలు

(5వ పేజీ తరువాయి)

లేదు. ఓవైపు ప్రభుత్వం కొనుగోళ్లలో సవాలక్ష నిబంధనలు పెడుతుండడమే ప్రధాన కారణ మని తెలుస్తోంది. ఇప్పటికే కొనుగోళ్ల ఆలస్యం గా ప్రారంభించారు. కాంటా మొదలైనప్పటికీ కొనుగోళ్ల మాత్రం ముందుకు సాగడం లేదు. జిల్లా వ్యాప్తంగా 423కి పైగా ధాన్యం కొనుగోళ్ల కేంద్రాలను ప్రారంభించారు. కేంద్రాలకు గత నెలరోజుల కిందట నుంచే ధాన్యాన్ని రైతులు తరలిస్తున్నారు. కానీ పక్షం రోజుల నుంచే కేంద్రాల్లో ధాన్యం కాంటా ప్రారంభమైంది. జిల్లాలో ఇప్పటి వరకు 312 కొనుగోలు కేంద్రాల్లో 6,365 మంది రైతుల నుంచి 43,851 మెట్రిక్ టన్నులను మాత్రమే చేపట్టినట్లు అధికారులు చెబుతున్నారు. ఇందులో దొడ్డు రకం 37,304 మెట్రిక్ టన్నులు, సన్న రకం 6,547 మెట్రిక్ టన్నుల్లో కొనుగోలు చేశారు.

క్రీడా సామగ్రి అందజేత

రాజంపేట,న వంబరు 7(ఆంధ్రజ్యోతి): రాజంపేట మండలంలోని తలమడ్ల గ్రామంలో ఉన్నత పాఠశాలకు గురువారం రూ.30 వేల క్రీడ సామాగ్రిని గ్రీన్‌కో సోలార్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ అందించింది.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భిక్షపతి మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల నుండి ప్రతి సంవత్సరం పాఠశాలకు అవసరమైన క్రీడసామాగ్రిని అందించడం అభినందించదగిన విషయమని అన్నారు.క్రీడ సామాగ్రిని ఉపయోగించుకుని విద్యార్థులు పాఠశాలలో అన్ని ఆటలు ఆడుకుంటున్నారని కొంతమంది విద్యార్థులు కబడ్డి, వాలిబాల్ లాంటి ఆటలలో రాష్ట్రస్థాయికి కూడా ఎంపికయ్యారని తెలిపారు.ఈ కార్యక్రమంలో సోలార్ ఈజీఎం ఏసుబాబు, ఏస్‌జీ బాష, డిప్యుటి మేనేజర్ ఆదిత్యనారాయణ, ఉపాధ్యాయులు భగత్, చక్రపాణి, దయాకర్, అంజనేయులు, నారాయణ, ప్రభాకర్, వనిత, నారాయణ, నరసింహరెడ్డి,అనిత, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

శేషారావు మహరాజ్ మృతి

మద్నూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మద్నూర్ మండలంలోని తడిప్పర్గా గ్రామంలో అధ్యాత్మిక గురువు శేషారావు మహరాజ్ అనారోగ్యంతో మృతి చెందారు. మండలంలోని తడిప్పర్గా గ్రామంలో మొట్ట మొదటిసారిగా బసవేశ్వర మందిరాన్ని నిర్మించారు. ఈ ప్రాంతంలో ఇదే మొదటి బసవేశ్వర మందిరం కావడంతో మహారాష్ట్ర కర్ణాటక తెలంగాణ రాష్ట్రాల నుంచి భక్తులు ఆలయానికి వచ్చేవారు. వారికి ప్రతి ఏడాది బసవేశ్వర జయంతి రోజు అన్నదాన కార్యక్రమంతోపాటు భారీగా జాతర కార్యక్రమాలు నిర్వహించేవారు. భక్తులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తూ ఉంటున్న శేషారావు మహరాజ్ అనారోగ్యంతో మృతి చెందడంతో వేలాది మంది భక్తులు ఆయన అంతిమ యాత్రలో పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి పెద్ద చెరువులో చేప పిల్లల విడుదల



చేప పిల్లలను విడుదల చేస్తున్న అధికారులు, నాయకులు

ఎల్లారెడ్డి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలో ఉన్న పెద్ద చెరువులో గురువారం ఆర్డీవో మన్నె ప్రభాకర్ మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్ చేతుల మీదుగా చేప పిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మత్స్యకారులు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ప్రభుత్వం ఉచితంగానే చేప పిల్లలను విడుదల చేస్తుందని మత్స్యకారులు వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యాశాఖ అధికారి శ్రీపతి, మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు, ఎంపీడీవో ప్రకాష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కురుమ సాయిబాబా, నాయకులు నునుగొండ శ్రీనివాస్, విద్యాసాగర్, సుజిత్, పోచయ్య, నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.

12న జరిగే ఆదర్శ రైతుల సమావేశానికి తరలిరావాలి

తాడ్వాయి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఈనెల 12న జరిగే ఆదర్శ రైతుల సమావేశా నికి మండలంలోని మాజీ ఆదర్శ రైతులు అందరూ తరలిరావాలని మండల ఆదర్శ రైతులు అన్నారు. వీరు 12న హైదరాబాద్‌లో జరిగే సమావేశానికి తరలిరావాలని గురువారం మండల కేంద్రంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు సమావేశాన్ని నిర్వహించినట్లు ఆదర్శ రైతులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఆదర్శ రైతులు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో పాడైన వస్తువులకు వేలం

రామారెడ్డి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రామారెడ్డి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పాడైన వస్తువులు వృధాగాపోవడం వల్ల ఈనెల 8న శుక్రవారం వేలం పాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి డాక్టర్ సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. పాత వస్తువులు అవసరం ఉన్నా వ్యక్తులు ఉదయం 10 గంటలకు వేలం పాట కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని వైద్యాధికారి డాక్టర్ సురేష్ వివరించారు.

నేడు మైలారానికి ఎమ్మెల్యే, ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ రాక

నసురుల్లాబాద్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మైలారం గ్రామంలో నూతనంగా నిర్మించినటువంటి పెద్దమ్మ గుడి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి శుక్రవారం ముఖ్య అతిథిగా మాజీ శాసనసభాపతి, తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, తెలంగాణ ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌లు రానున్నారని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పెరిక శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. కావున కార్యకర్తలు, గ్రామ పెద్దలు సమయానికి వచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

రైతులు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

● తహసీల్దార్ సువర్ణ

రామారెడ్డి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రైతులు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని రామారెడ్డి తహసీల్దార్ సువర్ణ పేర్కొన్నారు. రామారెడ్డి మండల కేంద్రంతో పాటు గిద్ద, ఇసన్నపల్లి, ఉప్పలవాయి గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులు పండించిన వరి ధాన్యం కొనుగోలు విధానాన్ని పరిశీలించారు. విధులు సక్రమంగా నిర్వహించాలని సిబ్బందికి పలు సలహాలు, సూచనలు అందజేశారు. అనంతరం మాజీ ఎంపీపీ నారెడ్డి దశరథ్ పరిశీలించారు. రైతులను ఇబ్బందులకు గురి చేయవద్దని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో రాకేష్, సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్ కామారెడ్డి




కామారెడ్డి

శాంతి	- లక్కీ భాస్కర్
దర్శన్	- అప్పుడో ఇప్పుడో ఎప్పుడో
ప్రియా 35	- అమరన్
ప్రియా 70	- క

బాన్సువాడ

మహేశ్వరి	- లక్కీ భాస్కర్
వెంకటేశ్వర	- అమరన్

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	160	200	220
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

